ప్రజాజ్యోతి
12 పేజీలు
కరీంనగర్
రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి
గురువారం 14, మే 2026 www.prajajyothinews.com పేజీలు :10

# వడ్ల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

**– జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**



బీర్ పూర్, మే13, ప్రజా జ్యోతి: రైతులు పండించిన వడ్ల కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఆదేశించారు. బుధవారం ఆయన సారంగాపూర్ మండలంలోని పలు వడ్ల కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, ధాన్యం సేకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కొనుగోలు చేయాలని సెంటర్ ఇంచార్జీలకు సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించి, అక్కడ కూడా త్వరగా దింపుకునేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి, మండల తహసీల్దార్ వాహిదోద్దీన్, ఏపీఎం, సీఈఓ, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.



# ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

**– గర్భిణీలు, బాలింతల పట్ల ప్రత్యేక శ్రద్ధ**
**– వైద్య సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలి**
**– జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా**

**జమ్మికుంట, మే13 ( ప్రజాజ్యోతి ):** ప్రభుత్వాసుపత్రికి వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, వైద్య సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. జమ్మికుంట ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. హాజరు, ఒపీ, ఐపి తదితర రిజిస్టర్లను పరిశీలించారు. వైద్య సిబ్బంది వివరాలు, ఖాళీల సంఖ్య, చికిత్స పొందుతున్న రోగుల సంఖ్య రోజువారి ఐపి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్, డ్రెస్సింగ్ రూమ్, మహిళా, పురుషుల వార్డులు పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య

వివరాలు 5లో..



# మానవత్వం చూపండి నిశాంత్ ప్రాణాలను కాపాడండి



కొనరావుపేట, మే.13(ప్రజాజ్యోతి) కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన లోకుర్తి నిశాంత్ (11) తీవ్రమైన అనారోగ్యంతో ప్రాణాపాయ స్థితిలో పోరాడుతున్నాడు. ఇటీవల అతనికి తీవ్రమైన జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించగా వైద్యులు బ్రెయిన్ ఇన్ఫెక్షన్ వచ్చినట్లు నిర్ధారించారు. ప్రస్తుతం నిశాంత్ హైదరాబాదులోని నీలోఫర్ హాస్పిటల్ లో ఐసీయూ లో చికిత్స పొందుతు న్నాడు. అతని పరిస్థితి విషమంగా ఉండ డంతో అత్యవసర వైద్యం కొన సాగుతుంది అత్యవసర వైద్యానికి భారీ మొత్తంలో ఖర్చవుతుంది అని డాక్టర్లు కుటుంబ సభ్యులకు తెలిపారు. నిశాంత్ కుటుంబం సాధారణ ఆర్థిక పరిస్థితుల్లో ఉండటంతో అంత పెద్ద మొత్తన్ని భరించటం వారికి చాలా స్పష్టంగా మారింది తమ బిడ్డ ను కాపాడుకోవాలని తల్లి తండ్రు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ పసిప్రాణాలను

4లో.



# పీఎం సేతు పథకాన్ని జిల్లాలో సమర్ధవంతంగా అమలు చేయాలి

– జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
–సింగరేణి, ఎన్టీపీసీ సంస్థలతో భాగస్వామ్యానికి చర్యలు తీసుకోవాలి
– ఐటీఐల ఆధునీకరణతో యువతకు సుస్థిర ఉపాధి అవకాశాలు కల్పించాలి
– పరిశ్రమల అనుసంధానంతో ఆధునిక నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం
– పీఎం సేతు పథకం అమలుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్

5లో..

# ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగను జరుపుకోవాలి

– కలెక్టర్ చిత్రా మిశ్రా
– బక్రీద్ పండుగ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం




7లో..

# మత్తు పదార్థాలపై నిఘాను పెంచండి

**– డీసీపీ భూక్య రాంరెడ్డి**



రామగిరి, మే 13 (ప్రజాజ్యోతి) : మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, సేవనంపై నిరంతర నిఘా కొనసాగించాలని పెద్దపల్లి డీసీపీ భూక్య రాంరెడ్డి రామగిరి పోలీసులకు సూచించారు. గురువారం రామగిరి పోలీస్ స్టేషన్‌ను పెద్దపల్లి డీసీపీ భూక్య రాంరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్

6లో..

## ఎమ్మెల్యే కవ్వంపల్లికి....

# ధాన్యం సేకరణపై సమీక్ష చేసే తీరిక లేదా

**– మాజీ జిల్లా ప్రజాపరిషత్ వైస్ చైర్మన్ సిద్ధం వేణు**

**– స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పత్తాలేకుండా పోయారు**



**ఇల్లంతకుంట మే13(ప్రజజ్యోతి)**ఇందిరమ్మ రాజ్యం వస్తే...రైతులను రాజులను చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు వట్టి నీటిమూటలుగానే మిగిలిపోతున్నాయని...రైతుల బ్రతుకులు ఆగమైపోతున్నాయని రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజాపరిషత్ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు అన్నారు. బుధవారం రోజు రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిద్ధం వేణు మాట్లాడుతూ మరో పది రోజుల్లో రోహిణి కార్తె వస్తుందని వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున యుద్ధప్రతిపాదికన ధాన్యం తూకం వేసి మిల్లులకు తరలించాలని డిమాండ్ చేశారు. ధాన్యం ఎక్కడికక్కడే పేరుకుపోయి ఉందని స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చుట్టపు చూపుగా ఇల్లంతకుంట లో నెల రోజుల క్రితం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి ఇటు వైపు తొంగిచూడటం లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యేకు రైతుల పట్ల కాస్తంత అయిన జాలి లేదని కొనుగోళ్లు సాగక... లారీలు రాక రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ఎర్రటి ఎండలో అన్నమో రామచంద్ర అంటున్న కూడా ఎమ్మెల్యే కు కనికరం లేదన్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ వెంటనే అధికారులతో సమీక్ష నిర్వహించి ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా సాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్, ఇతర శాఖల అధికారులు ఇల్లంతకుంట మండలంలోని రైతులను పట్టించుకోకుండా ఉన్నారని...లారీల సమస్య తీర్చి వెంటనే కొనుగోళ్లు పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వానికి ఇసుక క్వారీల నుంచి లారీలతో ఇసుక తరలింపులో ఉన్న శ్రద్ధ రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని మిల్లులకు తఫలించడంలో ఏమాత్రం సోయి లేదన్నారు. ఇసుక క్వారీలను బంద్ చేసి ధాన్యం తరలించాలని డిమాండ్ చేశారుఇల్లంతకుంట మండలంలోని రైతులు ధాన్యం, పొద్దుతిరుగుడు,మొక్కజొన్నలు కొనుగోలు చేసి తరలించాలని ధర్నాలు చేస్తున్నారని,అయినప్పటికీ స్థానిక ఎమ్మెల్యే, అధికారులకు చలనం లేదన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి రెండు లారీలు పంపించి కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మాజీ మండల అధ్యక్షుడు చేరుకుపెళ్ళి రాజిరెడ్డి, ఉపసర్పంచుల ఫోరమ్ మండల మాజీ అధ్యక్షుడు ఎండి. సాదుల్, ఏఎంసి మాజీ వైస్ చైర్మన్ ఎంద్ర చందన్, రవిందర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి,చేరుకుపెళ్ళి ఇంద్రసేనారెడ్డి తోట తిరుపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు

# నీట్ పేపర్ లీకేజీ కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం

**– ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**ముస్తాబాద్, మే 13 (ప్రజా జ్యోతి):** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మీడియా సమావేశంలో మాట్లాడారు. నీట్ ప్రశ్నాపత్రం లీకై పరీక్షనే రద్దు చేయాల్సిన పరిస్థితి రావడం కేంద్ర ప్రభుత్వానికి సిగ్గుచేటని ఆయన విమర్శించారు. బీజేపీ కేంద్ర ప్రభుత్వ అసమర్థత కారణంగానే ప్రశ్నాపత్రం లీక్ అయిందని ఆరోపించారు. భారత వైద్యులుగా ఎదగాలని కలలు కన్న విద్యార్థుల ఆశలను కేంద్ర ప్రభుత్వం చిదిమివేసిందన్నారు. కష్టపడి చదివిన విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం ఆటలాడుతోందని మండిపడ్డారు. పకడ్బందీగా పరీక్షలు నిర్వహించలేని కేంద్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే మరోసారి పేపర్ లీక్ జరిగిందన్నారు. ఈ నెల 3న రాజస్థాన్‌లో పేపర్ లీక్ కావడంతో పరీక్ష రద్దు కావడం విద్యార్థులను తీవ్ర ఆందోళనకు గురి చేసిందన్నారు. పరీక్షకు ముందురోజే ప్రశ్నాపత్రం బయటకు రావడం వ్యవస్థలో ఉన్న లోపాలను స్పష్టంగా బయటపెట్టిందన్నారు. దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష రాసిన దాదాపు 23 లక్షల మంది విద్యార్థులు, రాష్ట్రవ్యాప్తంగా 71 వేల మంది విద్యార్థులు వారి తల్లిదండ్రులు తీవ్ర మానసిక క్షోభకు గురయ్యారని తెలిపారు. నీట్ పేపర్ లీకేజీకి పూర్తి బాధ్యత వహించి కేంద్ర ప్రభుత్వం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో గ్రూప్–1 పేపర్ లీక్ కావడం వారి వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. నోటిఫికేషన్లు ఇవ్వకపోవడం, ఒకవేళ ఇస్తే పరీక్షలకు ముందే లీకేజీలు జరగడం అప్పటి ప్రభుత్వ పనితీరని విమర్శించాం ు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో సుమారు 70 వేల ఉద్యోగాల నియామక ప్రక్రియ చేపట్టినా ఒక్క పేపర్ కూడా లీక్ కాలేదని తెలిపారు. అది రాష్ట్రప్రభుత్వ సమర్థతకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిగా వైఫల్యం చెందుతున్నారని విమర్శించారు. ఇటీవల సభలో బంగారం కొనద్దంటూ ఆంక్షలు విధించడం వారి చేతకానితనానికి నిదర్శనమని అన్నారు. కేంద్రంలో రాహుల్ గాంధీ, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజాపాలన వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ చట్టానికి సహకరించాలని సూచించారు. విచారణకు సహకరిస్తే నిజాని జాలు బయటపడతాయని, భావోద్వేగ ప్రసంగాలు చేయడం సరైంది కాదన్నారు. తన కొడుకు తప్పు చేస్తే శిక్షించాలని వారే అంటున్నారని, చట్టానికి అప్పగిస్తే చట్టం తన పని తాను చేసుకుపోతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏళ్ల బాల్ రెడ్డి, కరీంనగర్ పార్లమెంట్ కో–కన్వీనర్ కనమేని చక్రధర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తలారి రాణి, పట్టణ అధ్యక్షులు గజ్జెల రాజు, మాజీ ఎంపిటిసి గుండెల్లి శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ వెలుముల రాంరెడ్డి, జిల్లా కార్యదర్శి కొండం రాజిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎదునూరి భానుచందర్, రంజాన్ నరేష్, మిడిదొడ్డి భాను కుమార్, ఎద్దండి మహేందర్, ఆగుల్ల రాజేశం, మామిండ్ల ఆంజనేయులు, పోతారం వంశీ, నవీన్, బండారి సాయి, తుపాకుల శ్రీనివాస్, కాంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఉప సర్పంచ్ కమలాకర్ రెడ్డి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు

**– దళితులంటే చిన్నచూపు ఎందుకు?**

**– ఉప సర్పంచ్ కమలాకర్ రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలి**

**– జాతీయ మాలల ఐక్యవేదిక సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం**



**గంభీరావుపేట మే 13 ( ప్రజా జ్యోతి);** గంభీరావు పేట మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ లక్కిరెడ్డి కమలాకర్ రెడ్డి ప్రజలను దళితులను ముస్లింలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని జాతీయ మాలల ఐక్యవేదిక సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం ఆరోపించారు. బుధవారం గంభీరావు పేట మండల కేంద్రంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద చంద్రం మాట్లాడుతూ,గత పదివేల బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రోడ్డు వెడల్పు ఎందుకు చేయలేదని ప్రశ్నించాడు. కేవలం దళితుల ముస్లింల షాపుల ముందున్న బోర్డులను తొలగించాలని భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని, కమలాకర్ రెడ్డి బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ ఈవో వినీల్ రెడ్డిని కూడా ప్రజల ముందు ప్రజలు చూస్తుండగానే బెదిరిస్తున్నాడని అన్నారు. కూరగాయలు క్రయవిక్రయదారులను రోడ్డుపై ఉన్న షాపుల వాళ్లను బెదిరిస్తున్నాడని మండిపడ్డారు. గంభీరావుపేట గ్రామాభివృద్ధికి కేటీఆర్ 300 లైట్లు అందిస్తే గ్రామపంచాయతీకి అప్పగించకుండా ఉపసర్పంచ్ కమలాకర్ రెడ్డి ఇంట్లో పెట్టుకుని అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నాడని ఆరోపించారు. గ్రామపంచాయతీ సపాయి కార్మికులను పనిచేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, గ్రామ పంచాయితీలో ఎన్నో ఏళ్లుగా ఎలక్ట్రిషన్ గా పనిచేస్తున్న ఇరిగి రామచంద్రం ను పనిచేయకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు కూడా చేశాడని గుర్తు చేశారు. జిల్లా కలెక్టర్ స్పందించి అధికార దుర్వినియోగానికి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఉపసర్పంచ్ కమలాకర్ రెడ్డి పై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా దోసల చంద్రం డిమాండ్ చేశారు.

## ధాన్యం 42 కేజీల తూకంతో కొనుగోలు చేయాలి

**– అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి**



**చొప్పదండి, మే13 (ప్రజాజ్యోతి):** ధాన్యం 42కేజీల తూకంతో కొనుగోలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాసరెడ్డి మిల్లర్లకు సూచించారు. బుధవారం తాహసిల్దార్ కార్యాలయంలో వారితో సమావేశం నిర్వహించారు. ఎప్పటికప్పుడు ఆలస్యం చేయకుండా లోడ్లు దిగుమతి చేసుకోవాలని చెప్పారు. డి సి ఎస్ ఓ నర్సింగరావు, డి ఎం రజనీకాంత్ రెడ్డి, తాసిల్దార్ నవీన్ కుమార్, మార్కెట్ చైర్మన్ మహేష్, విండో చైర్మన్ మల్లారెడ్డి, ఎం సి సి అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాసరెడ్డి, డిటి లు మన్మీత్ సింగ్, ఉష, ఆర్ ఐ లు త్రిపాల్ సింగ్ , ఎండి రహీం, లారీ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పోతుగల్ సర్పంచ్ కుటుంబ వివాహ వేడుకల్లో పాల్గొన్న సెస్ డైరెక్టర్ సంధుపట్ల అంజిరెడ్డి



**ముస్తాబాద్, మే 13(ప్రజా జ్యోతి):** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో పోతుగల్ గ్రామ సర్పంచ్ పెద్దిగారి యాదమ్మ -- శ్రీనివాస్ దంపతుల కుమార్తె వివాహ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ శుభకార్యానికి సెస్ డైరెక్టర్ సంధుపట్ల అంజిరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి దాంపత్య జీవితం ఆనందంగా, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో మాట్లాడిన అంజిరెడ్డి వివాహం అనేది రెండు కుటుంబాలను కలిపే పవిత్ర బంధమని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు, బంధుమిత్రుల సమక్షంలో సాంప్రదాయబద్ధంగా జరిగిన ఈ వేడుకలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. ఈ కార్యక్రమంలో ప్రజాస్ఫూర్తి విలేకర్ రాజేష్ , ముస్తాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు వంగూరి దిలీప్ , స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు, బంధుమిత్రులు తదితరులు పాల్గొని నూతన దంపతులకు ఆశీస్సులు అందజేశారు.

## బస్సు షెల్టర్ ప్రారభించిన వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్



**వేములవాడ,మే,13:ప్రజాజ్యోతి.** వేములవాడ అర్బన్ మండలం గుర్రంవానిపల్లె గ్రామంలో బుధ వారం రోజున నూతనము గా ని ర్మించిన బస్సు షెల్టర్ ను వేము లవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు బస్సు షెల్టర్ నిర్మాణం వల్ల గతం లో ఈ గ్రామస్థులు ప్రయాణికులు ఎండకువానకుఎదుర్కొన్నసమస్యలు తీరుతాయి అన్నారు ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు సీనియర్ కాంగ్రెస్నాయకులుఎర్రంఆగయ్య కాంగ్రెస్ నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## ప్రజా ప్రభుత్వంలో పేదల ఇంటికలనిజం చేయడమే లక్ష్యం.



**వేములవాడ,మే,13 :ప్రజాజ్యోతి.** వేములవాడ అర్బన్ మండలంలోని చీం వంచ గుర్రం వానిపల్లె గ్రావ రాలలో బుధవారం రోజున వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమం లో పాల్గొన్నారు ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నిజం చేయడ మే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తాను లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలి పారు అనంతరం వారికి నూతన వస్త్రాలను అందజేశారు లబ్దిదారులు గత పది సంవత్స రాలుగా ఇండ్ల కొరకు ఎదురు చూసామని ఆ కల ఇప్పుడు నెరవేరిందని సంతోషపడ్డారు ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మధు వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు కాంగ్రెస్ నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## పోతుగల్ గ్రామ సర్పంచ్ కుటుంబ వివాహ వేడుకలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు



**ముస్తాబాద్, మే 13 (ప్రజా జ్యోతి):** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని దత్త సాయి గార్డెన్స్‌లో పోతుగల్ గ్రామ సర్పంచ్ పెద్ది గారి యాదమ్మ--శ్రీనివాస్ దంపతుల కుమార్తె వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ వివాహ కార్యక్రమానికి హాజరైన మాజీ ఎంపీపీ జనగామ శరత్ రావు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు చందు రావు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ సెస్ డైరెక్టర్ ఏనుగు విజయ రామారావు, మాజీ సర్పంచ్ నల్ల నరసయ్య, మాజీ ఉపసర్పంచ్ కొండ శ్రీనివాస్ గౌడ్ నూతన వధూవరులను ఆశీర్వదించి వారి దాంపత్య జీవితం ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సడిమేల ఎల్లం, బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా వారియర్స్ పరిధిపేట వెంకటేష్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. వివాహ వేడుక ఆనందోత్సాహాల మధ్య సాంప్రదాయబద్ధంగా నిర్వహించబడింది.

## అతివేగంతో ప్రయాణికులను ఢీకొట్టిన స్కార్పియో..

### -క్షతగాత్రులను ఆసుపత్రికి తరలింపు

### - చికిత్స పొందుతూ మహిళ మృతి



**గంభీరావుపేట మే 13 (ప్రజా జ్యోతి):** గంభీరావుపేట మండలం రాజేశ్వరరావు నగర్ బస్టాండులో బుధవారం ఇద్దరూ మహిళ ప్రయాణికులు బస్సు కోసం నిల్చుండగా బస్సు వస్తున్న సమయంలో వెనుక నుండి అతివేగంగా అజాగ్రత్తగా ఓ వైట్ కలర్ స్కార్పియో వాహనం ఇద్దరు మహిళలు చిన్నారితో ఉండగా ఒక్కసారిగా ఢీకొట్టడంతో ఎగిరి పడిపోయారు. క్షతగాత్రులు అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో వెంటనే స్థానికులు హాస్పిటల్కు తరలించారు. అందులో ఒక మహిళ చికిత్స పొందుతూ చెల్లె లక్ష్మి38 సంవత్సరాల మహిళ మృతి చెందారు. మిగతా ఇద్దరు గాయపడిన వారిలో భోయిని యశ్వంత్, బోయిని రజిత, చికిత్స పొందుతున్నారు. వీరిని ఢీ కొట్టిన వాహనంతో పాటు డ్రైవర్ను అదుపులోకి తీసుకొనిపోలీస్ స్టేషన్కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పి. అనిల్ కుమార్ తెలిపారు.

## గంభీరావుపేట మండలం సముద్ర లింగాపురం, గజ సింగవరంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో తనిఖీ

### - తాసిల్దార్ మారుతి రెడ్డి



**గంభీరావుపేట, మే13 (ప్రజా జ్యోతి)** గంభీరావు పేట మండలం సముద్ర లింగాపూర్, గజ సింగవరం గ్రామాల్లో బుధవారం రోజున ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను తాసిల్దార్ మారుతి రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉన్నాయా అని పరిశీలించారు. కొనుగోలుకు సంబంధించిన రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం రాశులు పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు. తహసిల్దార్ మారుతి రెడ్డి మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు వేగంగా పూర్తి చేయవాలని, మిల్లులకు తరలించాలని సూచించారు. వీరి వెంట ఆర్ ఐ. ప్రశాంత్ పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న సెల్ ఫోన్ అప్పగింత



**కరీంనగర్ క్రైం,మే 13,ప్రజాజ్యోతి:** సి. ఈ. ఐ. ఆర్ టెక్నాలజీ సహాయంతో పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ను కనుగొని కరీంనగర్ రూరల్ పోలీసుల యజమానికి బుధవారం అప్పగించారు. బొమ్మకల్ గ్రామానికి చెందిన బెజ్జంకి శివశంకర్ తన వివో సెల్ ఫోన్‌ను చల్మెడ ఆనందరావు ఆసుపత్రి వద్ద పోగొట్టుకోవడంతో కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు సి. ఈ. ఐ. ఆర్ టెక్నాలజీ సహాయంతో సెల్ ఫోన్‌ను ట్రేస్ చేసి కరీంనగర్ ఖాన్‌పురా ప్రాంతంలో గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి సెల్ ఫోన్‌ను బాధితుడికి అందజేశారు. సెల్ ఫోన్ ట్రేసింగ్‌లో కీలకంగా వ్యవహరించిన కానిస్టేబుల్ చిట్యాల రామ్ సాయి,మహిళ కానిస్టేబుల్ సుప్రియలను ఇన్‌స్పెక్టర్ అభినందించారు.

# ముంపు ఏరియా లో పండిన వరిపంట ను కొనుగోలు చేయండి

### - తహసీల్దార్ ను కలిసిన భాధిత రైతులు



**తిమ్మాపూర్ మే 13 ( ప్రజాజ్యోతి ) :-** ముంపు కు గురై ఎఫ్ టి ఎల్ కు దూరంగా ఖాళీగా ఉన్నటువంటి భూములలో ఒక సీజన్ వ్యవసాయం చేసుకుంటూ పండించిన వరి పంట ను అధికారులు కొనుగోలు చేసేలా సహకరించాలని రామక్రిష్ణకాలనీ గ్రామ భాధిత రైతులు బుధవారం మండల తహసీల్దార్ కర్ర శ్రీనివాస్ రెడ్డి ని కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఎల్ఎండి రిజర్వాయర్ పరిధిలో ముంపుకు గురైన వారి స్వంత భూములలో సుమారు 70 మందికి పైగా గత 25 ఏళ్లుగా వ్యవసాయం చేసుకుంటూ తద్వారా వచ్చిన పంటలను అమ్ముకుంటూ వారి కుటుంబాలను పోషించుకుంటున్నారని, ఇలా పండించిన వరి ధాన్యాన్ని స్థానిక కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు చేయడం లేదని వారి వెంట వచ్చిన బీజేపీ నాయకులు, న్యాయవాది సుగుర్తి జగదీశ్వరాచారి తహసీల్దార్ కు వివరించారు. వ్యవసాయం తప్ప వేరే పనులు అలవాటు లేని సదరు రైతులు ఇలాంటి భూములలో పందిస్తున్న పంటలను మానవతా దృక్పధం తో ఆలోచించి కొనుగోలు చేయాలని వినతిపత్రం ద్వారా కోరారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం లో ఇటువంటి సమస్యలు ఎదురైనప్పుడు రైతు ద్వారా ధ్రువీకరించిన పత్రంనకు వ్యవసాయ అధికారి ద్వారా అనుమతి తీసుకొన్న తర్వాత కొనుగోలు చేశారని అదే విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు నివేదించి కొనుగోలు చేసేలా సహకరించాలని రైతులు గోనెల భూమయ్య,గంగు రాజమల్లు,గోనెల పర్శయ్య,కోతి మల్లేశం,గోనెల రాజు,ఆవుల లచ్చయ్య,గంగు తిరుపతి,అట్ల అంజయ్య,పురం సంపత్ తదితరులు తహసీల్దార్ ను కోరారు. వారి వెంట బీజేపీ నాయకులు గడ్డం అరుణ్,కోతి రాజు ఉన్నారు. ఉన్నతాధికారులకు నివేదించి సమస్య పరిష్కారం చేస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

# బండి సాయి భగీరథ ను వెంటనే అరెస్టు చేయాలి

### - బాధిత బాలిక కుటుంబానికి న్యాయం చేయాలి

### - సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి



**కరీంనగర్ కలెక్టరేట్, మే13 (ప్రజాజ్యోతి )** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ పై పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు వెంటనే అరెస్టు చేయాలని, నైతిక బాధ్యత వహిస్తూ బండి సంజయ్ తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని, బాధిత బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం రోజున స్థానిక గీతా భవన్ చౌరస్తాలో కళ్లకు గంతలు కట్టుకుని, ప్లకార్డులతో వినూత్న నిరసన చేశారు. ఈ సందర్భంగా వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ బండి సాయి భగీరథ పై ఎఫ్ ఐ ఆర్ నమోదు అయ్యి ఆరు రోజులు గడిచినప్పటికీ అరెస్ట్ చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. బండి భగీరథ బాలికను వేధించి బలవంతంగా మద్యం తాగించి అత్యాచారం చేసిన కేసులో పోలీసులు అనుసరిస్తున్న తీరు సరైంది కాదన్నారు. చట్టం ముందు అందరూ సమానులే కానీ కేంద్రమంత్రి కొడుకు కాబట్టి అరెస్టు చేయడంలో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. నిందితుడు గతంలో సైతం విద్యాసంస్థల్లో ర్యాగింగ్ చేయడం విద్యార్థులపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడటం వంటి అనేక ఆరోపణలు ఎదుర్కొన్న సంగతి బిజెపి నాయకులు మరిచిపోరాదన్నారు. నిరంతరం దేశం కోసం ధర్మం కోసం అని మాట్లాడే బిజెపి నాయకులు కేంద్రమంత్రి కుమారుడి ఘటనపై ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. భగీరథ పై గతంలోనే తనపై అపెన్స్ హిస్టరీ ఉందని, సాక్షులను తారుమారు చేసే రాజకీయ పలుకుబడి ఉన్నప్పటికీ పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్నారు. పోక్సో కేసులో వెంటనే అరెస్టు చేయాలని గతంలో ఇదే బండి సంజయ్ ఊదరగొట్టిన వీడియోలు ఉన్నాయన్నారు. తన కొడుకు ఎలాంటి తప్పు చేయకపోతే నిస్పాక్ష విచారణకు సిద్ధమని, తన కొడుకును పోలీసులకు అప్పజెప్పాల్సింది పోయి, తనపై కుట్రలు చేస్తున్నారని మొసలి కన్నీరు కార్చడమే కాకుండా, దేవుళ్లను సైతం తన సొంత రాజకీయ, కుటుంబ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారన్నారు. బండి సంజయ్ ద్వందనీతిని ప్రజలు గమనిస్తున్నారని సరైన సమయంలో బుద్ధి చెప్తారన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఈ కేసుతో బండి సంజయ్ కి బిజెపికి ఎలాంటి సంబంధం లేదని ప్రకటించడం చూస్తుంటే ఆశ్చర్యం వేస్తుందన్నారు. సంబంధం లేకుంటే ప్రధాని మోడీ సభలో బండి సంజయ్ ఎందుకు మాట్లాడారని ప్రశ్నించారు. హిందూ ఏక్తాయాత్రలో కూడా రాజకీయాలు ఎందుకు మాట్లాడారని ప్రశ్నించారు. తక్షణమే ఘటన పై సమగ్ర విచారణ జరిపించి, బండి సాయి భగీరథ పై రౌడీషీట్ ఓపెన్ చేసి, ఫోక్సో కేసులో వెంటనే అరెస్టు చేసి చట్ట పరమైన చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉండి తన కొడుకును కాపాడుకోవడం కోసం అధికారాన్ని అడ్డుపెట్టుకుంటున్న బండి సంజయ్ ని వెంటనే కేంద్ర మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామన్నారు. పోలీసు యంత్రాంగం ఇలానే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కలిసి వచ్చే రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, సామాజిక సంఘాలు, మహిళా సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం,జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గిట్లముకుందరెడ్డి, నాయకులు పుల్లెల మల్లయ్య, గజ్జల శ్రీకాంత్, కాంపెల్లి అరవింద్, శివ,ఆకాష్, సన్నీ, సందేశ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



**కరీంనగర్ కలెక్టరేట్, మే 13( ప్రజాజ్యోతి )** నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమంటూ, నీట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో స్థానిక తెలంగాణ చౌక్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్వీ జిల్లా మాజీ అధ్యక్షుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్ నాయకత్వం వహించారు. దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించగా, విద్యార్థి నాయకులు నిరసన కొనసాగించి దహనం నిర్వహించారు. ఈ సందర్భంగా కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా పొన్నం అనిల్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ పూర్తిగా కేంద్ర ప్రభుత్వ వైఫల్యమేనని ఆరోపించారు. దేశవ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును బీజేపీ ప్రభుత్వం అంధకారంలోకి నెట్టిందని విమర్శించారు. పేపర్ లీకేజీల కారణంగా ఇప్పటివరకు 53 లక్షలకుపైగా విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతిన్నదని అన్నారు. పరీక్షల నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఘోరంగా విఫలమైందని, రాత్రింబవళ్లు కష్టపడి చదివిన విద్యార్థులకు మోదీ ప్రభుత్వం ఇచ్చే బహుమతి పేపర్ లీకేజీయా అని ప్రశ్నించారు. బీజేపీ పాలిత రాష్ట్రాలు పేపర్ లీకేజీలకు కేరాఫ్ అడ్రస్‌లుగా మారాయని విమర్శించారు. రాధాకృష్ణన్ కమిటీ సిఫార్సులను పక్కనబెట్టి వేల కోట్ల రూపాయల లాభాల కోసం ఆన్‌లైన్ పరీక్షలను నిర్వహించడం లేదని ఆరోపించారు. నైతిక బాధ్యత వహిస్తూ ఎన్ టి ఏ డైరెక్టర్ జనరల్, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడం సిగ్గుచేటని పేర్కొన్న ఆయన, పేపర్ లీకేజీలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కఠిన చట్టాలు తీసుకురావాలని కోరారు. అకడమిక్ క్యాలెండర్ దెబ్బతినకుండా వెంటనే పకడ్బందీగా పరీక్ష తేదీలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో బీఆర్ఎస్వీ శాతవాహన యూనివర్సిటీ ఇన్‌చార్జ్ చుక్క శ్రీనివాస్, నగర బీఆర్ఎస్వీ అధ్యక్షుడు బొంకూరి మోహన్, నారదాసు వసంత్ రావు, పబ్బతి శ్రీనివాస్ రెడ్డి, వడ్లకొండ పరుశరామ్, అన్వేష్, సోహెల్, క్రాంతి, శ్రవణ్, రవి గౌడ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమం

**-మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్**



**గంభీరావుపేట మే13 (ప్రజాజ్యోతి);** గంభీరావు పేట మండలం లోని కురుదు లింగంపల్లి గ్రామంలో నూతనంగా ఇందిరమ్మ గృహ నిర్మాణం పథకం కింద నిర్మించబడినటువంటి గృహాన్ని బుధవారం రోజున మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రారంభించడం జరిగింది ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షులు హమీద్ మాట్లాడుతూ పేద ప్రజల కళ్ళలో ఆనందాన్ని చూడడానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తూ ఆర్థిక భారం ఉన్నప్పటికిని ప్రతి పేదవాడికి గూడు కల్పించాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నారని ఇటువంటి ప్రభుత్వానికి పేద ప్రజలందరూ అండగా ఉండాలని ఆశీర్వదించాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు భూమక్క బలరాం రెడ్డి సీనియర్ కాంగ్రెస్ నాయకులు సయ్యద్ నుస్రతుల్లా హుస్సేని , సాయిలు,దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ జిమ్ ప్రారంభించిన గ్రామ సర్పంచ్ కొండ రమేష్



**ఎల్లారెడ్డిపేట మే13 (ప్రజా జ్యోతి)** ఎల్లారెడ్డి పేట మండల కేంద్రంలోని రాచర్ల గొల్ల పెల్లికి చెందిన గ్రామపంచాయతీ పాలకవర్గం బుధవారం రోజు ఉదయం ఓపెన్ జిమ్ ను ప్రారంభించినారు. దీనినికి నాలుగు లక్షల రూపాయల వ్యయంతో సి డి పి నిధులతో శాసన సభ్యుల సహకారంతో నిర్మించినట్లు కొండ రమేష్ తెలిపారు. సహకరించిన స్థానిక శాసనసభ్యులు కల్వకుంట్ల రామారావు గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పొన్నాల మణమ్మ వార్డు సభ్యులు మల్లేష్ యాదవ్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్ గ్రామస్తులు సురేష్ మురళీమోహన్ పాలకవర్గం సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు

## ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించిన మంత్రి అడ్లూరి



**ధర్మారం, మే 13 (ప్రజాజ్యోతి న్యూస్):** ధర్మారం మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామంలో మంగళవారం నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని లబ్ధిదారురాలు వొడ్నాల రామక్కకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి విడతల వారీగా రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగుతోందని, రెండో విడతలో కూడా అర్హులైన వారికి ఇండ్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్రగుంటపల్లి సర్పంచ్ దూడ ప్రియాంక-తిరుపతి, ఉపసర్పంచ్ కోల తిరుపతి, కాంగ్రెస్ పార్టీ ధర్మారం మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రూప్లా నాయక్, మాజీ ఎంపీపీ కొడారి హనుమయ్య, పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి కొత్త నరసింహం, ధర్మపురి నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు యశోద అజయ్ కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కాంపెల్లి రాజేశం, ఆవుల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి నందులాల్, వార్డ్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతల ప్రదీప్ రెడ్డి, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పీఎం సేతు పథకాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- సింగరేణి, ఎన్టీపీసీ సంస్థలతో భాగస్వామ్యానికి చర్యలు తీసుకోవాలి
- ఐటీఐల ఆధునీకరణతో యువతకు సుస్థిర ఉపాధి అవకాశాలు కల్పించాలి
- పరిశ్రమల అనుసంధానంతో ఆధునిక నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం
- పీఎం సేతు పథకం అమలుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్



**పెద్దపల్లి, ప్రతినిధి మే 13 ప్రజా జ్యోతి;** పీఎం సేతు ఖ) పథకాన్ని పెద్దపల్లి జిల్లాలో సమర్థవంతంగా అమలు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. పీఎం సేతు పథకం అమలు పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 1000 ఐటీఐలను ఆధునీకరించేందుకు పీఎం సేతు (ావీ ాజుఖ) పథకం ప్రవేశపెట్టిందని కలెక్టర్ తెలిపారు. ఈ పథకం క్రింద 50 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం 33 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం 17 శాతం నిధులు పరిశ్రమలు భరించి ఐటిఐ క్లస్టర్లను ఆధునికరిస్తూ ప్రస్తుత అవసరాలకు తగిన విధంగా అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు. వచ్చే ఐదు సంవత్సరాల్లో పెద్దపల్లి క్లస్టర్ పరిధిలో ఐటీఐల మౌలిక వసతుల అభివృద్ధి, ఆధునికీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 120 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ. 80 కోట్లు వ్యయం చేయనున్నట్లు తెలిపారు. అదనంగా పారిశ్రామిక భాగస్వాములు కూడా సుమారు రూ. 40 కోట్లు వ్యయం చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పీఎం సేతు అమలుకు హైదరాబాద్, ఓల్డ్ సిటీ, పటాన్‌చెరు, మేడ్చల్, సంగారెడ్డి, పెద్దపల్లి ప్రాంతాలను క్లస్టర్లుగా గుర్తించారని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో పరిశ్రమలతో అనుసంధానం చేసి ఈ పథకాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. పెద్దపల్లి జిల్లాలో ఈ పథకాన్ని అమలు చేసేందుకు సింగరేణి కాల్లిరీస్ కంపెనీ లిమిటెడ్ (ాజజూ), ఎన్టీపీసీ లిమిటెడ్ సంస్థలతో భాగస్వామ్యం కోసం చర్చలు జరుపుతున్నామని అన్నారు. సింగరేణి ఎన్టీపీసీ అధికారులు వారి సంస్థల హెడ్ ఆఫీసులతో చర్చించి అవసరమైన అనుమతులు, నిధుల మంజూరు పొందాలని కోరారు. ఈ పథకం అమలులో భాగంగా ఏర్పాటు చేసే ప్రత్యేక ప్రయోజన వాహకం (స్రాఎ) ద్వారా నిధుల వినియోగం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రతి సంవత్సరం సుమారు రూ. 5 కోట్ల చొప్పున సింగరేణి, ఎన్టీపీసీ సంస్థలు జ-ా=, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమాల కింద వ్యయం చేసే అవకాశముందని పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న పెద్ద పరిశ్రమల సహకారంతో స్థానిక యువతకు ఆధునిక ప్రపంచ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు, సుస్థిర ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని కలెక్టర్ తెలిపారు. యువత నైపుణ్యాభివృద్ధి కోసం ఐటీఐల ఆధునీకరణ అత్యవసరమని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు నిర్వహణలో పరిశ్రమల ప్రతినిధులు కూడా భాగస్వాములుగా ఉండే విధంగా ప్రత్యేక ప్రయోజన వాహకం (స్రాఎ) వ్యవహరిస్తుందని కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో సిపిఓ రవీందర్, సింగరేణి సంస్థలు, ఆర్జీ 1, ఆర్జీ 2, ఆర్జీ 3 ,ఎన్టీపీసీ సంస్థల అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సర్పంచులే చురుకైన పాత్ర పోషించాలి

**- అడిషనల్ కలెక్టర్, డిఇఓ అశ్విని తనాజీ వాఖడే**




**చొప్పదండి, మే13 (ప్రజాజ్యోతి):** ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సర్పంచులు చురుకైన పాత్ర పోషించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు), డిఇఓ అశ్విని తానాజీ వాకడే అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక - విద్య వారోత్సవాల సందర్భంగా చొప్పదండి నవోదయ విద్యాలయంలో బుధవారం నియోజకవర్గంలోని సర్పంచులు, కౌన్సిలర్ల వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అల్పాహార పథకం, విద్యార్థులకు 24 ఐటమ్ ల కిట్, డిజిటల్ లెర్నింగ్, ప్రిపరేటరీ స్కూల్ లు వంటి నూతన విద్యా కార్యక్రమాలపై సర్పంచ్లకు అవగాహన కల్పించారు. చొప్పదండి మునిసిపల్ చైర్పర్సన్ వడ్లూరి సరిత మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ల్యాబ్ లు,డిజిటల్ విద్యా సదుపాయాలు వసతుల అభివృద్ధికి మున్సిపాలిటీ కట్టుబడి ఉందని తెలిపారు. వెలిచాల సర్పంచ్ నర్సింగరావు మాట్లాడుతూ మనబడి మన కట్టుబాటుతోనే అభివృద్ధి చెందుతుంది అని అన్నారు. రేవల్లి సర్పంచ్ అజయ్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల మాదిరిగా ప్రభుత్వ పాఠశాలల్లో కూడా వార్షికోత్సవాలు క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. ప్రభుత్వ అధికారులు ప్రైవేట్ పాఠశాలల కార్యక్రమాలకు హాజరు కాకుండా ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించాలని సూచించారు. నియోజకవర్గ విద్యాశాఖ నోడల్ అధికారి జి. జ్యోతి గ్రామస్థాయిలో విద్యాభివృద్ధికి సమిష్టి కృషి అవసరమని అన్నారు. సమగ్ర శిక్ష ప్లానింగ్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ ప్రభుత్వ నూతన విద్యా కార్యక్రమాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు, రామడుగు ఎంఈఓ రంగనాథ శర్మ, సర్పంచులు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

- గర్భిణీలు, బాలింతల పట్ల ప్రత్యేక శ్రద్ధ
- వైద్య సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలి
- జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా



**జమ్మికుంట, మే13 ( ప్రజాజ్యోతి ):** ప్రభుత్వాసుపత్రికి వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, వైద్య సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. జమ్మికుంట ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. హాజరు, ఒపీ, ఐపి తదితర రిజిస్టర్లను పరిశీలించారు. వైద్య సిబ్బంది వివరాలు, ఖాళీల సంఖ్య, చికిత్స పొందుతున్న రోగుల సంఖ్య రోజువారి ఐపి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్, డ్రెస్సింగ్ రూమ్, మహిళా, పురుషుల వార్డులు పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వైద్య సిబ్బందితో మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల మానవీయత చూపాలని అన్నారు. వారికి మెరుగైన వైద్య సేవ ఆడించాలని తెలిపారు. ముఖ్యంగా గర్భిణీలు, బాలింతల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. గర్భిణీలు క్రమం తప్పకుండా టీకాలు తీసుకునేలా చూడాలని, సాధారణ ప్రసవాలకు వారిని మానసికంగా సంసిద్ధం చేయాలని అన్నారు. ఆస్పత్రిలో ఉన్న అన్ని సౌకర్యాలు, వసతులను వినియోగించాలని ఆదేశించారు. ఖాళీగా ఉన్న వైద్య సిబ్బంది వివరాలు ఇవ్వాలని తెలిపారు. శానిటేషన్ సిబ్బందికి అవసరమైన రక్షణ కవచాలు అందించాలని ఆదేశించారు. అన్ని రకాల మందులు ఉండాలని తెలిపారు. కలెక్టర్ వెంట తహసిల్దార్ వెంకటరెడ్డి, మెడికల్ ఆఫీసర్ సంపత్ రెడ్డి ఉన్నారు.



# ధాన్యానికి అనుగుణంగా లారీల సంఖ్యను పెంచాలి

**– మర్తనపేట, నాగారంలో కొనుగోలు కేంద్రంలో తనిఖీ.**

**కలెక్టర్ గరిమ అగ్రవాల్.**



**కొనరావుపేట, మే.13(ప్రజా జ్యోతి)**కొనుగోలు కేంద్రాల్లో ధాన్యానికి అనుగుణంగా లారీల సంఖ్యను పెంచాలని ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. కోనరావుపేట మండలం మర్తనపేట, నాగారం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ బుధవారం తనిఖీ చేశారు. తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉన్నాయా అని పరిశీలించారు. కొనుగోలుకు సంబంధించిన రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం రాశులు పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు వేగంగా పూర్తి చేయాలని, మిల్లులకు తరలించాలని సూచించారు. మిల్లర్లు హమాలీల సంఖ్య ను పెంచి వెంట వెంటనే ధాన్యం అన్ లోడింగ్ చేయాలని ఆదేశించారు. లారీల ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు వెంటనే వాహనాల సంఖ్య పెంచాలని, ధాన్యానికి అనుగుణంగా వాహనాలను సమకూర్చాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. టార్పాలిన్లు అందుబాటులో పెట్టాలని, వాతావరణ శాఖ హెచ్చరికలు ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేయాలని సూచించారు. ధాన్యం తడవకుండా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. తనిఖీలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా పౌర సరఫరాల అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# రాజన్న ఆలయం వద్ద 150 మంది అన్నార్తులకు భక్తులకు అన్నదానంఅరటిపండ్ల పంపిణీ



**వేములవాడ,మే,13:ప్రజాజ్యోతి.**మైవేములవాడచారిటబుల్ట్రస్టు ఆధ్వర్యంలోదాతలసహకారంతో నిర్వహిస్తున్నఅన్నదానకా ర్యక్రమంలో భాగంగా బుధవారం రోజున రాజన్న ఆలయం వద్ద 150 నంది అన్నార్తులకు భక్తులకు అన్నదానంతో పాటు అరటిపండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని నేటి అన్నదాత లుగా 100 మంది పేదల అన్నార్తుల అన్నదానానికి విరాళంగా అందించిన ప్రతాప వారి కుటుంబ సభ్యులు చిన్నారి కందుల శ్రేయాన్వి పుట్టినరోజు సందర్భంగా తాత అమ్మమ్మ కొడిమ్యాల బ్రహ్మానందం రమాదేవి దంపతులు, అమ్మ నాన్న గారైన కందుల సాయిశ్రీ భార్గవ్ తేజ దంపతులు అలాగే చిన్నారి శ్రీత్రిక పుట్టినరోజు సందర్భంగా చింతలతడెం లాస్య అశోక్ దంపతులు శాశ్వత అన్నదాతలుగా డాక్టర్ జువ్వాడి వెంకటేశ్వరరావు స్నేహాలత దంపతులు ప్రతాప స్వప్న సంపత్ దంపతులు నగుబోతు రవీందర్ జ్యోతి దంపతులు గణాచారి మఠం శైలజ సాంబశివు దంపతులు దేవరాజు ఉమ బాలచందర్ రాజు దంపతులు రామడుగు శ్రీలత కొడుకులు కోడళ్లు: ప్రజ్ఞ శరత్చంద్రదంపతులు శిరీష సాయిచంద్ర దంపతులు శర్వాణి రవిచంద్ర దంపతులు హైదరాబాద్ వాస్తవ్యులు చిన్నారులు శ్రీహర్ష, సాయి కృష్ణ ఉన్నారని, పుట్టినరోజు పెళ్ళిరోజు ఇతరత్ర కార్యక్రమాలకు పేదలకు అన్నార్తులకు ఒక్కపూట అన్నదానం చేయలనుకునే దాతలు ట్రస్టు సభ్యులను గాని ట్రస్ట్ నంబరు 92469 39388కు సంప్రదించాలని ట్రస్టు నిర్వాహకులు మధు మహేష్ కోరారు. నేటి అన్నదాన కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మధు మహేష్ పొలాస రాజేందర్ పసుల శ్రీధర్ మఠం శివకుమార్ ఏలేశ్వరపు సాయినాథ్ గొట్టం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# మత్తు పదార్థాలపై నిఘాను పెంచండి

**– డీసీపీ భూక్య రాంరెడ్డి**

**రామగిరి, మే 13 (ప్రజాజ్యోతి):** మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, సేవనంపై నిరంతర నిఘా కొనసాగించాలని పెద్దపల్లి డీసీపీ భూక్య రాంరెడ్డి రామగిరి పోలీసులకు సూచించారు. గురువారం రామగిరి పోలీస్ స్టేషన్ను పెద్దపల్లి డీసీపీ భూక్య రాంరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలు, రికార్డులు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, గోడవలు, రౌడీ షీటర్ల వివరాలపై ఆరా తీశారు. మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని సిబ్బందికి సూచించారు. స్టేషన్ రిసెప్షన్ సిబ్బంది పనితీరు, వచ్చిన ఫిర్యాదులపై తీసుకున్న చర్యలు, ఆన్లైన్ నమోదు ప్రక్రియపై కూడా వివరాలు తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదుదారులతో అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని డీసీపీ సూచించారు. సమస్య పరిష్కారం అవుతుందనే నమ్మకం ప్రజల్లో కలిగేలా పనిచేయాలన్నారు. నేరాల కట్టడికి అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని, నేరం జరిగిన వెంటనే వేగంగా స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బ్లూ



కోల్ట్స్, పెట్రో కార్ సిబ్బంది విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని, డయల్-100 కాల్స్కు వెంటనే స్పందించి సంఘటన స్థలానికి త్వరగా చేరుకోవాలని సూచించారు. గంజాయి, మత్తుపదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, సేవనంపై నిరంతర నిఘా కొనసాగించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంథని సీఐ బొల్లపల్లి రాజు గౌడ్, రామగిరి ఎస్సైలు తాడవేని శ్రీనివాస్, దివ్యతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రెండో విడత దళిత బంధు విడుదల చేయాలి

**- మంత్రులను కలిసిన వీణవంక దళిత సంఘాల నాయకులు**

**వీణవంక, మే13(ప్రజాజ్యోతి)** హైదరాబాద్లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో హుజురాబాద్ నియోజకవర్గం రెండో విడత దళిత బంధు అమలుపై వీణవంక మండల దళిత సంఘాల నాయకులు పలువురు మంత్రులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో పాటు ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతంలను కలిసి హుజురాబాద్ నియోజకవర్గంలోని మిగిలిన అర్హులైన లబ్ధిదారులకు రెండో విడత దళిత బంధు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. దళిత బంధు అంశంపై మంత్రులు సానుకూలంగా స్పందించారని, హుజురాబాద్ నియోజకవర్గంలోని మిగిలిన లబ్ధిదారులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వల్భాపూర్ గ్రామ సర్పంచ్ అందె శ్రీమతి కుమార్, జీడి తిరుపతి, బండారి ప్రశాంత్, పర్లపల్లి తిరుపతి, అంబాల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ముస్తాబాద్‌లో ఎస్ఐఆర్‌పై అవగాహన సమావేశం నిర్వహణ



**ముస్తాబాద్, మే 13( ప్రజా జ్యోతి ):** ముస్తాబాద్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం రోజు ఎస్ఐఆర్పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్వైజర్లతో పాటు గ్రామ సర్పంచులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అధికారులు ఎస్ఐఆర్కు సంబంధించిన విధానాలు, బాధ్యతలు, ప్రజలకు అందించాల్సిన సేవలపై వివరించి అవగాహన కల్పించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# టీబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో 96 మందికి ఎక్స్‌రే పరీక్షలు




**ముస్తాబాద్, మే 13 ( ప్రజా జ్యోతి ):**ప్రజాపాలన ప్రగతిప్రణాళికలో భాగంగా ఈరోజు ముస్తాబాద్ మండలంలోని తెర్లుమద్ది గ్రామంలో టీబి ముక్త్ భారత్ అభియాన్ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా హైరిస్క్ గ్రామాలలో ఎక్స్రే పరీక్షల కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్ మరియు జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత ఆదేశానుసారం, డాక్టర్ ఆఫీజ గారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈరోజు తేది 13-05-2026 న నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 96 మంది హైరిస్క్ వ్యక్తులకు ఎక్స్రే పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెర్లుమద్ది గ్రామ సర్పంచ్ బైతి దుర్గమ్మ-నవీన్, ఉపసర్పంచ్ మామిండ్ల కనుకవ్వ, హెచ్ఈఓ భూమయ్య, హెచ్ఎస్ ప్రసాద్, టీబి సూపర్వైజర్లు మహిపాల్, జేత్య, గంగాధర్, డాక్టర్ రాజ్ కుమార్, ఎంఎల్హెచ్పీలు ఉదయ్, ఎక్స్రే టెక్నీషియన్ బాలు, ఏఎన్ఎంలు ధనలక్ష్మి, రాజనర్సమ్మ మరియు ఆశా వర్కర్లు బి మంజుల ఈ జ్యోతి ఏ జ్యోతి ఎల్ అనురాధ పాల్గొన్నారు.

# సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు మెంబర్ గా రాపాక ప్రవీణ్



**తిమ్మాపూర్ మే13 (ప్రజాజ్యోతి):-** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ రాపాక ప్రవీణ్ ను సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు మెంబర్ గా నియమిస్తున్నట్లు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్ రీజినల్ ఆఫీసర్ డాక్టర్ రాహుల్ గౌలికర్ ఉత్తర్వులు జారీ చేశా రు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి పార్లమెంటు సభ్యులు బోయినపల్లి ప్రవీణ్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈనుగోండ నాగేశ్వర్ రెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు రంగు భాస్కరాచారి గారికి, గుర్రాల వెంకటరెడ్డి మండల అధ్యక్షులు కంది రాజిరెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.



# గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

## – పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన
## – ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణారావు



**సుల్తానాబాద్, మే 13: (ప్రజా జ్యోతి)** గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. బుధవారం సుల్తానాబాద్ మండలంలోని బొంతకుంటపల్లి, నరసయ్యపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించి గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. బొంతకుంటపల్లి గ్రామంలో రూ. 8 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని సీసీ రోడ్లను ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. గ్రామాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తూ ప్రతి గ్రామంలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో రహదారులు, డ్రైనేజీలు, కమ్యూనిటీ హాళ్లు, విద్యుత్ సదుపాయాలు, తాగునీటి సౌకర్యాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ.. బొంతకుంటపల్లి గ్రామంలో ఇప్పటివరకు సుమారు రూ. 40 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. గ్రామ ప్రజల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతం అవుతున్నాయని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యే విజయరమణారావును ఘనంగా సన్మానించారు. లింగంపల్లి కొమురయ్య, కొండ్ర స్వరూప ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రకాశ్‌రావు, సర్పంచులు శ్రీరంగారావు, జూపల్లి తిరుమలరావు, చిలుక సతీష్, లింగంపల్లి కొమురయ్య, ఎంపీడీవో దివ్యదర్శనరావు, పంచాయతీరాజ్ ఏఈ సచిన్, కొండ్ర స్వరూప, ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగను జరుపుకోవాలి

## – కలెక్టర్ చిత్రా మిశ్రా
## – బక్రీద్ పండుగ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం






**కరీంనగర్ బ్యూరో, మే 13(ప్రజాజ్యోతి)** బక్రీద్ పండుగను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకునేలా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. బక్రీద్ పండుగ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో పాటు ముస్లిం మత పెద్దలతో బుధవారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, జిల్లా స్థాయి అధికారులు, ముస్లిం మత పెద్దలు, కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. పండుగ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పక్కాగా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ముస్లిం మత పెద్దల సూచనలు, సలహాలను స్వీకరించి అధికారులకు పలు దిశానిర్దేశాలు చేశారు. బక్రీద్ నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయం తో పని చేయాలని కలెక్టర్ సూచించారు. పశువుల అక్రమ రవాణా నిరోధానికి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈద్గాల వద్ద అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు నమాజ్ సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. మసీదుల పరిసరాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా వేస్ట్ కవర్లను పంపిణీ చేయాలని సూచించారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా సమయానికి నీరు అందేలా చూడాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూలి బక్రీద్ పండుగ సందర్భంగా అన్ని రకాల భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. నగరంలో పూర్తి స్థాయి బందోబస్తు నిర్వహిస్తూ పండుగను సామరస్య వాతావరణంలో నిర్వహించుకు నేలా చర్యలు తీసుకుంటున్నా మని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ డి శ్రీనివాస్ రెడ్డిఅడిషనల్ డీసీపీ వెంకటరమణ ఆర్డీవోలు కే మహేశ్వర్ రమేష్ బాబు, జిల్లాస్థాయి అధికారులు ముస్లిం మత పెద్దలు కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# నర్సింగాపూర్‌లో సందడిగా ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలు

## – త్వరలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు : కాంగ్రెస్ నాయకులు



**వీణవంక, మే 13(ప్రజాజ్యోతి )** హుజురాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కల నెరవేరుతోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గంగాడి తిరుపతిరెడ్డి, కొమ్మిడి రాకేష్ రెడ్డి అన్నారు. బుధవారం వీణవంక మండల పరిధిలోని నర్సింగాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమాలకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మంగళహారతులతో నాయకులకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గంగాడి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి విడతలో అనేక మంది పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ద్వారా ఆర్థిక భరోసా కల్పించిందన్నారు. పేదవాడి సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి త్వరలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్నట్లు చెప్పారు. సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉయ్యాల సాంబయ్య, కొండల్ రెడ్డి విద్యాసాగర్, గణేష్ తదితర నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంస్య పథకం సాధించిన ఆదర్శ పాఠశాల విద్యార్థిని



**ధర్మారం,మే13 (ప్రజాజ్యోతి ):** ధర్మారం మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో చదువుతున్న తుమ్మల మనోజ్ఞ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చి కాంస్య పథకాన్ని సాధించింది. అండర్-16 హైజంప్ విభాగంలో మూడవ స్థానం పొందిన ఆమెను పాఠశాల ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ నెల 10న హనుమకొండ జిల్లాలో నిర్వహించిన 11వ తెలంగా ణ రాష్ట్ర స్థాయి జంప్స్ అండ్ త్రోస్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్న మనోజ్ఞ, హైజంప్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చి మూడో స్థానం సాధించింది. బుధవారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు బైకని కొమరయ్య,మేకల సంజీవరావు మరియు విద్యార్థిని తల్లిదండ్రులు ఆమెను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# భార్య మృతితో మనస్తాపం.. సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి ఆత్మహత్య

**రామగిరి, మే 13 (ప్రజాజ్యోతి) :** రామగిరి మండల పరిధిలో సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన విషాదాన్ని నింపింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మైలారం చంద్రయ్య (68) సింగరేణి ఓసీపీ-2లో పనిచేసి రిటైర్ అయ్యాడు. ప్రస్తుతం అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఇంటివద్దనే ఉంటున్నాడు. 17 రోజుల క్రితం భార్య లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందడంతో చంద్రయ్య తీవ్ర మనస్తాపానికి గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. భార్య మరణం తర్వాత తరచూ దిగులుగా ఉంటూ మానసికంగా కలత చెందేవాడని పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన కర్మ కార్యక్రమాల అనంతరం కుటుంబ సభ్యులు తమ తమ ప్రాంతాలకు వెళ్లగా, చంద్రయ్య ఇంట్లో ఒంటరిగా ఉన్నాడు. బుధవారం ఉదయం ఇంటి వద్ద కనిపించకపోవడంతో స్థానికులు ఇంట్లో వెతికారు. ఇంటి పక్కన ఉన్న బాత్రూంలో పైకప్పు ఇనుప పైపుకు నైలాన్ తాడుతో ఉరివేసుకుని చంద్రయ్య మృతిచెందినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి చేరుకున్నారు. భార్య మృతిని తట్టుకోలేక మనస్తాపంతోనే చంద్రయ్య ఆత్మహత్య చేసుకున్నాడని కుమారుడు మైలారం శ్రీను పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి అనుమానాలు లేవని కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు

# ఆసుపత్రికి 9 కుర్చీల వితరణ



**కాల్వ శ్రీరాంపూర్ మే 13 (ప్రజా జ్యోతి)** కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రానికి చెందిన కీర్తిశేషురాలు. జక్కబోయిన రాజమ్మ. జ్ఞాపకార్థం. మృతురాలి కుటుంబీకులు 9 కుర్చీలను. ప్రభుత్వఆసుపత్రికి బుధవారం రోజున అందజేశారు. కుర్చీలు అందజేసిన వారిని . డాక్టర్లు మహేందర్ . శ్రీనివాస్ . వైద్య సిబ్బంది . తదితరులు. అభినందించారు.

## మడిపల్లి లో మహిళా సమాఖ్య భవనానికి భూమిపూజ



**జమ్మికుంట, మే13 ( ప్రజాజ్యోతి ):** జమ్మికుంట మండలం మడిపల్లి లో మహిళా సమాఖ్య సంఘ భవన నిర్మాణానికి సర్పంచ్ మ్యాకమల్ల తిరుమల - వెంకటేష్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. భవన నిర్మాణానికి రూ. 10 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని ఆకాంక్షించారు. గ్రామ సమగ్ర అభివృద్ధితో పాటు విద్య, మహిళా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఆమె పేర్కొన్నారు. గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కస్తూరి శ్రీనాథ్ ,వార్డు సభ్యులు రాజమణి, మర్రి కళ్యాణి, చిన్నబోయిన చంద్రమౌళి , తాళ్ల పెల్లి ఆంజనేయులు, వంగ రాణి, పసరగొండ శ్రీనివాస్ ,కస్తూరి శశివధన, గంగారపు సాయిరాం ,సీఏ లు బోనగానిప్రియాంక, పరమేశ్వరి, గంగారపు స్వప్న, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మ్యాకమల్ల అశోక్, జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ డైరెక్టర ఎగ్గటి సదానందం తదితరులు పాల్గొన్నారు

# బక్రీద్ బందోబస్తుపై డీజీపీ వీడియో కాన్ఫరెన్స్



**కరీంనగర్ క్రైం,మే 13,ప్రజాజ్యోతి:** బక్రీద్ పండుగ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణపై బుధవారం సీవీ ఆనంద్ ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో గౌస్ ఆలం పాల్గొన్నారు. పండుగ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని డీజీపీ అధికారులకు ఆదేశించారు. ఈద్గాలు,మసీదులు, మార్కెట్ ప్రాంతాలు,ప్రధాన రహదారులు జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసి, ఈద్గాల వద్ద పార్కింగ్ సదుపాయాలు, ట్రాఫిక్ మళ్లింపులు, అత్యవసర సేవలకు ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు,రెచ్చగొట్టే పోస్టులు, వదంతులపై సైబర్ మానిటరింగ్‌ను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. అనుమానాస్పద సమాచారం వచ్చిన వెంటనే స్థానిక పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా,సీసీ కెమెరాల పర్యవేక్షణ,చెక్‌పోస్టుల వద్ద 24 గంటల విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మత పెద్దలు,ప్రజాప్రతినిధులు, శాంతి కమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహించి సామరస్య వాతావరణంలో బక్రీద్ పండుగ జరుపుకునేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ,ఏసీపీలు శ్రీనివాస్,విజయకుమార్, వెంకటస్వామి ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోలులో అలసత్వం చేస్తే సహించేది లేదు

## – మంత్రి పొన్నం ప్రభాకర్

**చిగురుమామిడి :మే14, ప్రజా జ్యోతి** ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారంచిగురుమామిడి మండలం నవాబుపేట ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియలో అధికారులు సిబ్బంది అలసత్వం చేస్తే సహించేది లేదన్నారు. గన్ని బ్యాగ్స్ ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం త్వరితగతిన మిల్లులకు పంపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు సిబ్బంది సమన్వయంతో పనిచేసుకుంటూ ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలన్నారు. అనంతరం గ్రామంలోని పలువురు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల గృహప్రవేశాలను ప్రారంభించి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ప్రభుత్వం మాట నిలుపుకొని ఇల్లు లేని పేదలకు ఇండ్ల మంజూరు చేస్తుందన్నారు. మొదటి దశ ఇండ్ల నిర్మాణ ప్రక్రియ చివరి దశలో ఉందన్నారు. జూన్ నెల నుండి రెండవ దశ ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రారంభం కాబోతుందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు తొందరగా ఇండ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలన్నారు. స్థానిక నాయకత్వం కూడా వారికి సహకరించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో పది సంవత్సరాలు ఎదురు చూసినా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు రాలేదని,నేడు ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం



జరిగిందన్నారు. నియోజకవర్గంలో పేదలకు ప్రతి ఏడాది 3500 ఇండ్లను కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. పేద ప్రజలు ఆర్థిక వెసులుబాటు కల్పించుకొని ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గూళ్ళ రజిత రాజు,హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి,ఉపసర్పంచ్ ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి,కరీంనగర్ డిసిసి ఉపాధ్యక్షుడు,గీకు రవీందర్,కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఠాకూర్ నరేందర్ సింగ్,జిల్లా నాయకులు,వార్డు మెంబర్లు,రైతులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయాలు చేయొద్దు...

**– చదువుల తల్లి స్థలం కోసం ఎంపీ అరవింద్ ధర్మదీక్ష**

**– జగిత్యాల బీజేపీ నియోజకవర్గ ఇంచార్జీ డాక్టర్ భోగ శ్రావణ**

రాయికల్, మే 13 (ప్రజా జ్యోతి) రాయికల్ పట్టణంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జగిత్యాల బీజేపీ నియోజకవర్గ ఇంచార్జీ డాక్టర్ భోగ శ్రావణి మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తు కోసం నిజామాబాద్ ఎంపీ చేపట్టనున్న ధర్మదీక్షకు ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున మద్దతు ఇవ్వాలని కోరారు. చదువుల తల్లి స్థలం కోసం, నవోదయ పాఠశాల మరియు కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్థలం కేటాయించాలని ఆమె డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం ముందుకు వచ్చి పాఠశాలలను మంజూరు చేసినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా స్థలం కేటాయించకుండా జాప్యం చేస్తోందని విమర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ కుట్రలతో విద్యార్థుల భవిష్యత్తును గాలికి వదిలేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. జగిత్యాల నియోజకవర్గంలో కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేపియాల్సిందిగా నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు శ్రీ అరవింద్ ధర్మపురి గారిని అడిగిన వెంటనే వారు పిల్లల భవిష్యత్తు కోసం కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేపియడం జరిగింది. కానీ స్థలం కేటాయింపులో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. పక్కనే ఉన్న కోరుట్ల నియోజకవర్గంలో ఇప్పటికే నవోదయ పాఠశాల ప్రారంభమై అడ్మిషన్లు కూడా కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. జగిత్యాలలో కూడా సమయానికి స్థలం కేటాయించి ఉంటే ఇప్పటికి పాఠశాల ప్రారంభమై విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేదని



పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక నాయకుల నిర్లక్ష్యం వల్ల రెండు సంవత్సరాలుగా విద్యార్థులు నష్టపోతున్నారని, వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. విద్యాభివృద్ధిలో కూడా రాజకీయాలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఈ నెల 15వ తేదీ లోపు రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించాలని గడువు ఇచ్చామని, ఆలోపు చర్యలు తీసుకోకపోతే జగిత్యాల జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహం ఎదుట ఎంపీ ధర్మపురి అరవింద్ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. ఈ ధర్మదీక్షకు బీజేపీ రాష్ట్ర నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయనున్నారని తెలిపారు. జగిత్యాల నియోజకవర్గ ప్రజలు, రాయికల్ పట్టణం, మండల ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ భోగ శ్రావణి కోరారు. ఈ కార్యక్రమంలో రాయికల్ పట్టణ అధ్యక్షులు కుర్మా మల్లారెడ్డి, రాయికల్ మండల్ అధ్యక్షులు ఆకుల మహేష్, రాయికల్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కల్లెడ ధర్మపురి, 11వ వార్డ్ కౌన్సిలర్ పుర్రె శ్రీధర్, సహకార సంఘం చైర్మన్ ముత్యం రెడ్డి, కునారపు భూమేష్, రవీందర్ రెడ్డి, వేముల రాము, తోపారపు సురేష్, పటేల్ రాము, సామల్ల సతీష్, సింగని సతీష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందుర్తి లో సినిమా ముహూర్తం షాట్

## – క్లాప్ కొట్టి ప్రారంభించిన ఎస్సై పృథ్విధర్ గౌడ్



**చిగురుమామిడి /మే 14,ప్రజా జ్యోతి** వెలుగు క్రియేషన్ వారిబ్యానర్‌లో నిర్మించనున్న సినిమాకు చిగురుమామిడి మండలంలోని ఇందుర్తి గ్రామంలోని ఎల్లమ్మ తల్లి గుడి ఆవరణంలో ముహూర్తపు షాట్‌ను ముఖ్య అతిథిగాఎస్సై పృథ్విధర్ గౌడ్ హాజరై క్లాప్ కొట్టి బుధవారం ప్రారంభించారు. అంతకుముందు ఎల్లమ్మ తల్లికి సినిమా డైరెక్టర్ రిషి, నిర్మాతలు,హీరో భరత్, కార్యనిర్వాహకుడు ఆకుల వెంకటేష్ , ప్రత్యేక పూజలు నిర్వహించారు. సినిమా డైరెక్టర్ రిషి మాట్లాడుతూ.... ఇందుర్తి గ్రామంలోని రేణుక ఎల్లమ్మ తల్లి గుడి ఆవరణంలో సినిమా ముహూర్తం ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ సినిమా దైవభక్తి, మరియు వ్యవసాయ భూములకు సంబంధించిన సినిమాని, ఇ సినిమాని ఇందుర్తి గ్రామ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరిస్తామని, బలగం సినిమా తరహాలోనే ఉంటుందని, ప్రేక్షకులకు ఎంతగానో ఈ సినిమా నచ్చుతుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చింతపూల నరేందర్, ఉప సర్పంచ్ అనిల్, వార్డ్ సభ్యులు కిరణ్, గట్టు లక్ష్మి ఎల్లయ్య,గౌడ సంఘం అధ్యక్షులు గట్టు మొగిలి, ఆకుల శ్రీనివాస్, చిత్ర నటీనటులు, కలర్ సత్తయ్య గౌడ్, రేవల్లి శంకర్, శీను, ఇందుర్తి గౌడ సంఘం నాయకులు గట్టు రమేష్, లచ్చయ్య, సత్తన్న, అభినయ్, సాత్విక్, దుంబాల కిరణ్, గట్టు తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

# పశు యాజమానులు తప్పనిసరిగా మీ ఇళ్లల్లో సంరక్షించుకోవాలి.

## – వెల్గటూర్ ఎస్సై, పి ఉదయ్ కుమార్,



**ఎండపల్లి, మే 13, ప్రజా జ్యోతి** మండల కేంద్రంతో పాటు మండల వ్యాప్తంగా రహదారి, రోడ్లపై పశువు లు సంచరిస్తుండడంతో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలు ఉన్నాయి రహదారిపైనే కాకుండా కాలనీల్లోని అంతర్గత రోడ్లపైనా ఇష్టారీతిన సంచరిస్తుండడం వల్ల ప్రజలకు ఇబ్బందికరంగా మారుతోంది. ద్విచక్రవాహనదారులు వాటిని తప్పించే ప్రయ త్నంలో ప్రమాదాల బారిన పడే అవకాశాలు లేకపోలేదు,కొన్ని సందర్భాల్లో రహదారిపై పశువులు పోట్లాడుకుం టూ పక్కనుంచి వెళ్లే వాహదారులపై పడుతుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా వెల్గటూర్ ఎస్సై ఉదయ్ కుమార్ పశువుల యాజమానులకు కొన్ని సూచనలు చేస్తూ,పశువుల యజమానులు తమ ఆవులు, ఎద్దులు,,గేదెలను రాత్రి సమయంలో తప్పనిసరిగా తమ ఇళ్ల వద్ద , సురక్షితమైన ప్రదేశాల్లో కట్టివేసుకోవాలనీ,ఎలాంటి పరిస్థితల్లోనూ రాత్రివేళలోబయట రోడ్లపై,ఖాళీ ప్రదేశాల్లో వదిలివేయరాదనీ,ఒకవేళ రాత్రి సమయంలో యజమానులు లేకుండా సంచరిస్తున్న పశువులు గుర్తించిన పక్షంలో,వాటిని వీధి పశువులుగా గుర్తించి గ్రామపంచాయతీ అధికారుల సహకారంతో ప్రభుత్వ అధీనంలోకి తీసుకునే చర్యలు చేపడతామని తెలియజేస్తూ,ప్రజలు పోలీసు శాఖకు సహకరించి తమ పశువులను సంరక్షించుకోవడంతో పాటు అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే,వెంటనే వెల్గటూర్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఒక ప్రకటనలో కోరారు,

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదల కల సాకారం,



**ఎండపల్లి, మే 13, ప్రజా జ్యోతి** గ్రామ అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ప్రజా పాలనలో భాగంగా మండలంలోని ఉండేడ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబమైన గంధం జ్యోతి సత్యనారాయణ ,ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సంబంధించిన స్లాబ్ పనులకు బుధవారం రోజున గ్రామ సర్పంచ్ ఆవుల మమత తిరుపతి లబ్ధిదారులతో కలిసి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించడం జరిగినది. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆశీర్వాదాలతో గ్రామ అభివృద్ధి లక్ష్యంగా నిరంతరం పనిచేస్తానని గ్రామస్తుల సహకారంతో గ్రామాన్ని అత్యున్నత స్థాయిలో తీర్చిదిద్దుతానని ఇందిరమ్మ ఇల్లు నిర్మాణంతో పేదల సొంతింటి కల నెరవేరబోతుందని ఆశాభవం వ్యక్తం చేశారు,